


# చదువు మధ్యలో ఏదో కాస్త...

నాన్నగారికి మరోసారి ట్రాన్స్‌ఫర్ అయింది. ఆ ఊళ్ళో మంచి స్కూల్ లేదని మమ్మల్ని తాతగారింట్లో ఉంచి చదివించాలని నిర్ణయించారు. అన్నయ్యా, నేనూ యాజలి స్కూల్లో చేరాం. మా ఇంటికీ స్కూలుకీ మట్టిగోడే అడ్డు. ఆ గోడ కూడా గొప్పదేమీ కాదు. నాలాగా పరికిణీ వేసుకున్న ఆడపిల్లలు కూడా అమాంతం దూకేయొచ్చు. దక్షిణం వైపు స్కూలు. ఒక పాత ఇంటిని స్కూలుగా మార్చారు. చుట్టూ పెద్ద సాకడులుగా కట్టి మట్టిగోడలతో రూములుగా విభజించారు.

నీలం, తెలుపు యూనిఫాం కుట్టించి స్కూలుకి పంపింది అమ్మమ్మ. గేటు దాకా దిగబెట్టి మళ్ళీ గోడ దగ్గరికి వచ్చి "భద్రంగా జేరావుగా. వెళ్ళి క్లాసులో కూర్చో" అని చెప్పింది.

మా ఇంటి పక్కనే నా క్లాసు. ప్రేయరు అయి మేము క్లాసుల్లోకి రాగానే తాతయ్య వచ్చారు. "పిల్లలను ఓసారి చూసి వెళ్దామని వచ్చాను" అని చెప్పి నన్నూ! అన్నయ్యనూ చూసి వెళ్ళారు.

మరికాసేపటికి దక్షిణం వాకిట్లో నిలబడి "అమ్మడూ విజయా! బావున్నావా అమ్మా" అని అరిచింది అమ్మమ్మ.

నేను మాస్టారి వంక చూశాను.

"ఆఁబాగానే ఉందండీ" అని సమాధానం చెప్పారు మాస్టారు.

"ఎవరదీ, సీతాపతి మాస్టారా? మా నాయనే... మా తండ్రే... ఆ ముక్క దానిచేతే చెప్పిస్తే వెళ్ళి పనిచేసుకుంటాను" బతిమాలింది.

"నువ్వే చెప్పు" అన్నారు మాస్టారు.

"నేను బాగానే ఉన్నాను అమ్మమ్మా" అని చెప్పాను.

సోషలు పీరియడ్‌లో వెంకటాచలం మాస్టారినీ, ఆ తరవాత క్లాసులో తెలుగు మాస్టారినీ నా యోగక్షేమాలు అడుగుతూనే ఉంది. ఆవేళ్టికి స్కూలు అయిపోయింది.

పొద్దున్నే అన్నం వండేది అమ్మమ్మ. పచ్చడీ పెరుగూ వేసుకుని సుష్టుగా తిని స్కూలుకి వెళ్ళేవాళ్ళం. మర్నాడు సోషలు క్లాసులో మాస్టారు పాఠం చెప్తూ ఉండగా మా ఇంట్లోంచి చిలకడదుంప కాలస్తున్న వాసన వచ్చింది.

నోట్లో నీళ్ళూరాయి. పాఠం తలకి ఎక్కలేదు. ఇంటికొచ్చాక ఆ మాటే చెప్పాను అమ్మమ్మతో.

"నీకేవిటి... నాకూ బాధనిపించింది. వేడివేడిగా బిడ్డలకి పెట్టలేకపోతున్నాను కదా అని దిగులేసింది" అంది అమ్మమ్మ బాధగా.

"మరెలా అమ్మమ్మా... మన కష్టాలు తీరే దారే లేదా?" అన్నా.

"నీ బుర్ర పాదరసం. నువ్వే ఏదో మార్గం చూడు" అంది అమ్మమ్మ.

ఆవిడకి నామీద అంత నమ్మకం ఉన్నప్పుడు మరి ఏదో ఉపాయం ఆలోచించాలి కదా! "సరే చూద్దాంలే!" అని హామీ ఇచ్చాను.

మర్నాడు వేరుసెనక్కాయలు వేయిస్తున్న వాసన రాగానే నిలబడి "సార్ గొంతెండిపోతోంది. మా ఇంటికెళ్ళి మంచినీళ్ళు తాగివస్తాను" అన్నాను.

"ఇంటికెందుకమ్మా... స్కూల్లో కుండల్లో ఉన్నాయిగా" అన్నారు మాస్టారు.

"ఆ మూల కుండల దగ్గరికి వెళ్ళే లోగా ఇటు మా ఇంటికి వెళ్ళి మళ్ళీ వచ్చేయొచ్చు" అన్నాను వినయంగానే.

"సరే వెళ్ళు" ఆయన మాట నోట్లో ఉండగానే గోడదూకి ఇంట్లోకి వెళ్ళి సెనక్కాయలు తిని మంచినీళ్ళు తాగి స్కూలుకి వచ్చేశాను.

పెన్సిలు ముల్లు విరిగింది చెక్కుకు వస్తాననో, కడుపులో నొప్పిగా ఉంది కస్తూరిమాత్ర వేసుకొస్తాననో గంటకి ఒకసారి ఇంటికొచ్చి కాస్త నోరాడించి మళ్ళీ వెళ్ళేదాన్ని. ఇటు నేనిలా చేస్తుంటే అమ్మమ్మ కూడా ఆవిడ వంతు సాయం చేసేది. గోడ దగ్గరికి వచ్చి "ఎవరదీ? రామక్రిష్ణ మాస్టారా? బాగున్నావా నాయనా... చాలా రోజులయింది చూసి. భార్యాపిల్లలూ కులాసాయేనా? బెల్లు అవగానే మా మనవరాల్ని పంపిస్తే నాలుగు నిమ్మకాయలు పంపిస్తాను" అంటే-

"బెల్లయేదాకా ఎందుకు పిన్నిగారూ, ఇప్పుడే పంపిస్తాను" అన్నారు మాస్టారు.

ఇంటికెళ్ళి రెండు సున్నుండలూ, రెండు వేయించిన గుమ్మడి వడియాలూ తినేసి నిమ్మకాయలు తీసుకుని వచ్చేశాను.

అరటిదూట ఇస్తాననో, మునక్కాడలిస్తాననో అంటే వెంటనే నన్ను పంపించేసే వాళ్ళు. నెలరోజులు అలాగే జరిగిపోయింది. రోజుకు నాలుగైదుసార్లు ఇంటికొచ్చి పోయేదాన్ని.

ఆదివారం అమ్మ వచ్చింది.

"ఈ ఊరి నీళ్ళు దీనికి బాగానే పడ్డట్లు ఉన్నాయి. బుగ్గలు వచ్చి బాగుంది" అని ఆనందపడింది.

మరో పదిరోజులు గడిచేసరికి అమ్మకి అనుమానం వచ్చింది కాబోలు దగ్గర కూర్చోబెట్టుకుని "ఏమ్మా! మూడు పూటలా అన్నంకాక మధ్యలో ఏమైనా తింటుంటావా?" అని అడిగింది గారంగా.

"ఆఁ ఏం తింటాను? రోజంతా చదువుతోనే సరిపోతుంది. ఏదో పనిమీద ఇంటికొచ్చినప్పుడు కాస్త తింటాను. పొద్దునపూట సున్నుండ, కజ్జికాయ, కారప్పూస నోట్లో వేసుకుంటాను. సాయంత్రంకూడా అంతేలే. పోతే సెనక్కాయలూ, చిలకడదుంపలూ, మొక్కజొన్న కండెలూ, జామపళ్ళూ ఇవన్నీ దేవుడు మనకోసం సృష్టించిన పిండి వంటలు- అవి ఎలాగూ తినాలి" అన్నాను.

మండిపడింది అమ్మ.

"అదేం తిండే... బకాసురుడి బంధువులాగా. సిగ్గుగా లేదూ నీకు" అని తిట్టింది. వెంటనే అమ్మమ్మని పిలిచాను.

"చాల్లే ఊరుకో... ఎదిగే పిల్ల ఆ మాత్రం తినకపోతే ఎట్లా? ఆ స్కూల్లో పాఠాలు చదివేసరికి శోష వస్తోంది దానికి" అని నాకు వత్తాసు పలికింది.

"శోష కాదు పూటుగా తిని భుక్తాయాసంతో నిద్ర వస్తోంది దానికి. రేపటినుంచి మధ్యలో ఇంటికొచ్చినట్లు తెలిసిందో కాళ్ళు విరగ్గొడతా!" అంది అమ్మ.

"చాల్లే ఏవిటా మాటలు. తల్లి దిష్టి తప్పకుండా తగులుతుందంటారు. నీ చేత్తోనే కాస్త ఉప్పు దిగదుడిచి పారెయ్" అంది అమ్మమ్మ.

"అది కాదమ్మా... స్కూల్లో పాఠాలు కష్టంగా ఉన్నాయ్. ఆ మాత్రం తినకపోతే నీరసం వస్తుంది నాకు" అన్నాను.

"పాఠాలు కష్టంగా ఉంటే కష్టపడి చదువుకోవాలి. అంతేగానీ గంటకోసారి చిరుతిళ్ళు తింటుంటే వస్తాయా పాఠాలు. నీ బులిబుచ్చికప్ప కబుర్లన్నీ నా దగ్గర సాగవు" అని గట్టిగా చెప్పింది.

అంతేకాదు, ఓసారి స్కూలుకు వెళ్తే మధ్యలో రాకుండా చూడమని తాతయ్యతో చెప్పింది. దాంతో నా రాకపోకలు బంద్ అయ్యాయి. అంతమాత్రాన మేమెందు కూరుకుంటాం? మర్నాడు పొద్దున ఇన్ని చిరుతిళ్ళు కాయితంలో కట్టి ఇచ్చింది అమ్మమ్మ. అవి పుస్తకాల సంచీలో పెట్టుకుని పెద్ద మరచెంబుతో నీళ్ళు తీసుకుని స్కూలుకి వెళ్ళాను.

"ఏమిటమ్మా ఇది...యాత్రలకి వెళ్తున్నట్లు ఈ మరచెంబు ఎందుకు?" అని అడిగారు మాస్టారు.

స్వవిషయాలు పరాయివాళ్ళకేం చెప్తాం? అందుకే 'నాకు మామూలు నీళ్ళు పడవు. కాచి చల్లార్చి తెచ్చుకుంటాను' అని చెప్పేశాను.

ఏం చేస్తాం మరి? శతకోటి దరిద్రాలకు అనంతకోటి ఉపాయాలు.

* * *